telugubooks

# కప్ప కథ

కప్పలు ఒకప్పుడు మధురంగా పాడేవట. ఆ తర్వాత వాటి గొంతు పోయింది. దీనిగురించి పెద్దలు ఒక కథ చెబుతారు.

ఒకానొకప్పుడు ఓ కప్ప, దాని మిత్రుడు చిట్టెలుక కలసి వెళుతున్నాయి. మంచి వంటకం సువాసన వాటికి తగిలింది. దగ్గరలోనే మాంసం ఉడుకుతున్న పొయ్యి కనిపించింది. సన్నటి మంట మీద కుండలో మాంసం ఉడుకుతున్నది. దగ్గరలో ఎవరూ లేరు.

"ఎవరో మాంసం వండుతున్నారు." ముక్కుపుటాలు ఎగరేసి కప్ప అన్నది." ఆ కుండ యజమాని పరిసరాలలో లేడు. కాబట్టి మాంసాన్ని తిందామని ఆ రెండు నిశ్చయించుకున్నాయి. వంతుల వారిగా తిందామని ఓ ఉపాయం ఆలోచించాయి. మొదట ఒకరు తింటుంటే ఇంకొకరు కాపలా కాయాలి. మాంసం యజమాని వస్తూంటే అరవాలి.

చిట్టెలుక తనకు బాగా ఆకలవుతుందని చెప్పి మొదట తినసాగింది. తర్వాత కప్ప తినడం మొదలు పెట్టింది. చిన్న చిన్న ముక్కలు



వదలి నోటి నిండా ఉండే పెద్ద మాంసం ముక్కను నోట్లో పెట్టుకుంది కప్ప. ఇంతలో చిట్టెలుక అరిచింది, అదిగో యజమాని వస్తున్నాడని!

యజమాని అంతదూరం నుంచే కప్పను బెదిరిస్తూ అరిచాడు. అసలే భయంతో బిక్క చచ్చి పోయిన కప్పకు వేడి మాంసం ముక్క గొంతులో దిగబడింది. దగ్గరలోనే ఒక ప్రదేశంలో దాక్కుంది. చిట్టెలుక ఎప్పుడో పారిపోయింది.

ఆ రోజు సాయంకాలం కప్ప పాడలేదు. చుట్టు పక్కల జంతువులన్నీ కప్పా! కప్పా! నీ మధురమైన గొంతుతో ఈ పూట ఎందుకు పాడటం లేదు, అని అడిగాయి. కప్ప "సరే ప్రయత్నిస్తా"నని నోరు తెరిచి పాడబోయింది.

" బెకబెక బెకబెక " చప్పుడు తప్ప మరో ధ్వని రావడం లేదు. మాంసం వేడికి దాని గొంతు కాలిపోయింది. అప్పటి నుంచి కప్పలకు మధురమైన గొంతు లేదు.

**అత్యాశ, ఆత్రం ఎప్పటికీ చేటు!**